లక్ష్యం నీది.. చేయూత నాది..



రామంతాపూర్: మెగా మహిళా డిగ్రీ కళాశాలకు చెందిన ఐదుగురు విద్యార్థినులకు బీఎల్ఆర్ ట్రస్ట్ చైర్మన్ బండారి లక్ష్మారెడ్డి గురువారం ఆర్థిక సాయం అందజేశారు. బీకామ్ చదువుకున్న విద్యార్థులు ఫీజులు చెల్లించలేక ఇబ్బంది పడుతున్న విషయాన్ని తెలుసుకొని ఆర్థిక సాయం చేశారు. కార్యక్రమంలో సభ్యులు పాలకూరి శ్రీకాంత్‌గౌడ్, నరేష్, శంకర్, చిన్నారావు, చాంద్‌పాషా, పవన్, శ్రీకాంత్‌గౌడ్, సాయిరాం, జహంగీర్, మున్నా తదితరులు పాల్గొన్నారు.

ఖైదీ.. సన్మార్గంలో నడువోయి..

కుషాయిగూడ: చర్లపల్లి కేంద్ర కారాగారంలో జైలు శిక్ష అనుభవిస్తున్న ఖైదీలు సన్మార్గంలో నడిచేలా హరేరామ హరేకృష్ణ ఇస్కాన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో వ్యక్తిత్వ వికాసంపై శిక్షణ తరగతులను నిర్వహించారు. జీవితంలో మార్పు అవసరమని, సమాజంలో ఉన్నతంగా జీవించాలని అన్నారు. ఆధ్యాత్మిక చింతనతో నైతిక విలువలను పొందించుకోవచ్చని చెప్పారు. జైలు పర్యవేక్షణాధికారి సంతోష్‌కుమార్ రాయ్, ఫౌండేషన్ ప్రతినిధులు శ్రీరామ సకదాసు, సుధాకర్, దీపక్‌కుమార్, మహబూచదాసు, జైలు ఉప పర్యవేక్షణాధికారులు శశికాంత్, కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.



చకచకా తవ్వి.. నిర్లక్ష్యంగా వదిలేసి..



అల్వాల్: అసలే ఇరుకైన రోడ్డు.. పైగా నిత్యం రద్దీగా ఉండే ప్రాంతం.. పక్కనే లాయోలా కాలేజీ.. నిత్యం పెద్దఎత్తున విద్యార్థుల రాకపోకలు.. ఓల్డ్ అల్వాల్‌లోని ఫాదర్ బాలయ్యనగర్‌లోని తిరుమల ఎన్‌క్లేవ్ వద్ద జీహెచ్ఎంసీ వారు నాలా నిర్మాణ పనుల కోసం గుంతను తవ్వారు. నెలలు గడుస్తున్నా పనులు పూర్తి చేయకుండా, గుంతను పూడ్చకుండా అలాగే వదిలేశారు. దీంతో అటు వైపు రాకపోకలు సాగించే వాహనదారులు, సమీపంలోని లయోలా కాలేజీ విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. ఆ గుంత కారణంగా రోడ్డు ఇరుగ్గా మారి ప్రమాదాలు జరుగుతున్నాయి. అధికారులు స్పందించాలని కోరుతున్నారు.

స్వచ్ఛత.. అందరి బాధ్యత

కుషాయిగూడ: సమష్టి భాగస్వామ్యంతోనే స్వచ్ఛత సాధ్యమవుతుందని అణు ఇంధన కేంద్రీయ విద్యాలయ స్కూల్–1 ప్రిన్సిపల్ రోమా కథపా అన్నారు. స్వచ్ఛత వారోత్సవాల సందర్భంగా అణు ఇంధన సంస్థ(ఎన్ఎఫ్‌సీ), అణు ఇంధన కేంద్రీయ విద్యాలయ సంయుక్తాధ్వర్యంలో గురువారం డీఏఈ కాలనీలో విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. అందరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. దేశాన్ని స్వచ్ఛ భారత్‌గా తీర్చిదిద్దాలని పిలుపునిచ్చారు. హెడ్ మిసెస్ సోనియా కపూర్, ఎం.ఎల్.శర్మ, ఇంద్ర, అహ్మద్, రాజిరెడ్డి, శ్రీధర్, శాస్త్రి, మధుసింగ్ తదితరులు పాల్గొన్నారు.



13వ డివిజన్ అభివృద్ధికి రూ.3.86 కోట్లు

బోడుప్పల్: 13వ డివిజన్‌లో రూ.3.86 కోట్లతో మౌలిక వసతులు కల్పించినట్లు కార్పొరేటర్ దానగల్ల అనిత యాదగిరి అన్నారు. కార్పొరేటర్‌గా మూడేళ్లు పూర్తిచేసుకున్న సందర్భంగా గురువారం ఆమె మాట్లాడుతూ సీసీ రోడ్ల అభివృద్ధికి రూ.1.84 కోట్లు, వాటర్ ట్యాంక్, తాగునీరు, పైపులైన్ల నిర్మాణం కోసం రూ.1.56 కోట్లు, హరిత హారంలో మొక్కల ఏర్పాటుకు రూ.25 లక్షలు, బీటీ రోడ్డు నిర్మాణం కోసం రూ.9 లక్షలు, హైమాస్ట్ లైట్ల కోసం రూ.7 లక్షలు, సీసీ కెమెరాలకు రూ.5 లక్షలు ఖర్చుచేసినట్లు వెల్లడించారు. మంత్రి చామకూర మల్లారెడ్డి, మేయర్ సామల బుచ్చిరెడ్డి సహకారంతో తన డివిజన్ పరిధిలో ప్రజల సౌకర్యార్థం వెజ్, నాన్‌వెజ్ మార్కెట్లను నిర్మిస్తున్నట్లు ఆమె వెల్లడించారు. రానున్న రెండేళ్లలో డివిజన్ పరిధిలో మిగిలిపోయిన పనులను పూర్తి చేస్తామన్నారు.



సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తూ..

యాక్షన్ ప్లాన్.. దోమల పనిబడతాం..

మేడిపల్లి: చెరువులు.. కుంటలు.. గుంతలు.. నాలాలు.. దోమలకు ఆవాసాలు. ఆయా ప్రాంతాలపై దృష్టి పెట్టి యాక్షన్ ప్లాన్ సిద్ధం చేసింది పీర్జాదిగూడ నగర పాలక సంస్థ. ముురుగు, నీరు నిల్వ ఉన్న ప్రాంతాల్లో బ్లీచింగ్ పౌడర్ చల్లడం, చెరువులు, కుంటల్లో ఆయిల్ బాల్స్ వేయడం, వీధుల్లో స్ప్రేయింగ్ మిషన్లతో పిచికారీ చేయడం వంటి వాటితో దోమల నియంత్రణకు యాక్షన్ ప్లాన్ సిద్ధం చేసినట్లు మేయర్ జక్క వెంకట్‌రెడ్డి తెలిపారు. పీర్జాదిగూడలో గురువారం ఆయన మాట్లాడారు. నాలాల్లో పూడిత తీయడం, చెరువుల్లో గుర్రపు డెక్కను తొలగించడం జోరుగా కొనసాగుతున్నట్లు చెప్పారు. దోమల నివారణకు సిబ్బంది శ్రమిస్తున్నారని ఆయన అన్నారు.



మైదానాలిట్టా.. ఆటలాడేదెట్టా?



మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో ఆట స్థలాలున్నా నిర్వహణ లేక ఆడలేని దుస్థితి

- గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోని ఉత్తమ క్రీడాకారులను వెలికితీసే ప్రభుత్వ లక్ష్యానికి తూట్లు
- జిల్లాలో ప్రాంగణాల సంఖ్య 281.. పూర్తయింది మాత్రం 106 మాత్రమే..
- పూర్తయిన వాటిలోనూ.. అరకొర వసతులే..
- నిరాశలో క్రీడల్లో శిక్షణ పొందాలనుకునే యువత

సాక్షి,మేడ్చల్ జిల్లా: గ్రామీణ, పట్టణాల్లోని చిన్నారులు, యువతను ఉత్తమ క్రీడాకారులుగా తీర్చిదిద్దాలన్న లక్ష్యంతో పంచాయతీ, పురపాలక సంఘాల పరిధిలో తెలంగాణ క్రీడా ప్రాంగణాలు ఏర్పాటు చేశారు. ఆర్భాటంగా వాటిని ప్రారంభించినప్పటికీ నిర్వహణ మరిచిపోవడంతో అలంకార ప్రాయంగా మారాయి. తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోని యువత, చిన్నారులను క్రీడాకారులుగా తీర్చిదిద్దాలన్న లక్ష్యానికి నీరు గారుతోంది.

జిల్లాలో 281 క్రీడా మైదానాలకు అనుమతి..

మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో 61 పంచాయతీలతో పాటు 13 పట్టణాల్లో కలిపి 281 క్రీడా ప్రాంగణాలకు ప్రభుత్వం అనుమతిని ఇచ్చినప్పటికీ ప్రభుత్వ స్థలాల కొరతతో ప్రాంగణాల ఏర్పాటులో తీవ్ర జాప్యం జరుగుతోంది. జిల్లా వ్యాప్తంగా ఇప్పటి వరకు 106 పూర్తి చేయగా, మరో 19 ప్రగతిలో ఉన్నట్లు నివేదికలు చెబుతున్నాయి. ప్రారంభించిన క్రీడా ప్రాంగణాల్లో ఇప్పటి వరకు సరైన వసతులు కల్పించకపోవడంతో క్రీడాకారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మైదానాల్లో మరమ్మతులు సరిగా చేయకపోవడంతో పాటు అవసరమైన వ్యాయామ పరికరాలు ఏర్పాటు చేయలేదని క్రీడాకారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నిధులు వృథా...

పంచాయతీలు, పట్టణ ప్రాంతాల్లో అర ఎకరం నుంచి ఎకరం విస్తీర్ణంలో క్రీడా ప్రాంగణాల నిర్మాణానికి ప్రభుత్వం ప్రణాళికలు రూపొందించటంతో పాటు క్రీడా పరికరాలు, మౌలిక వసతుల కల్పనకు ఒక్కో ప్రాంగణానికి రూ.2.5 లక్షల నుంచి రూ.3.5 లక్షల వరకు నిధులు వెచ్చించింది. జిల్లాలో ఇప్పటి వరకు 106 తెలంగాణ క్రీడా ప్రాంగణాలకు సుమారుగా రూ.3.18 కోట్లు వెచ్చించినా 40 శాతం క్రీడా ప్రాంగణాలను లేఅవుట్లు, పార్కు స్థలాల్లో నిర్మాణాలు చేపట్టినట్లు గ్రామీణ క్రీడాకారులు పేర్కొంటున్నారు. యువత, చిన్నారులు ఆటలు ఆడేందుకు మైదానం తయారు చేయించడం, వాటిల్లో వాలీబాల్, ఖోఖో కోర్టులతో పాటు యువతకు లాంగ్ జంప్ చేసేందుకు వీలుగా తీర్చిదిద్దడం, సింగిల్, డబుల్ బార్ ఏర్పాటుతో సహా చుట్టూ మొక్కలు నాటించడం, వ్యాయామ పరికరాలు ఏర్పాటు చేయాల్సి ఉంది. అయితే స్థలాల కొరత కారణంగా గ్రామాలకు దూరంగానూ, కొద్దిపాటి ఖాళీ స్థలాల్లో తెలంగాణ క్రీడా ప్రాంగణం పేరిట బోర్డులు, వాలీబాల్ పోల్స్ నాటి, వ్యాయామ పరికరాలు ఏర్పాటు చేసి వదిలేశారు. దీంతో నిధులు వెచ్చించినా ప్రాంగణాలు నిరుపయోగంగా మారాయి. పలు ప్రాంగణాల్లో క్రీడా సామగ్రి లేకపోవడంతో పాటు శిక్షకుల నియామకం కూడా జరగలేదు. ముఖ్యంగా క్రీడా ప్రాంగణాలకు చాలా చోట్ల ప్రహరీ లేకపోవడంతో తీవ్ర ఇబ్బందిగా ఉంది.

- పలు పంచాయతీల్లో బిల్డర్లు, పలు సంస్థల సహకారంతో క్రీడా ప్రాంగణాలను అభివృద్ధి పరిచి పరికరాలు సమకూర్చినట్లు పత్రాలు చూపించి.. బిల్లులు కూడా కాజేసినట్లు ఆరోపణలు ఉన్నాయి.
- మిగతా చోట్ల క్రీడా ప్రాంగణాలకు స్థల సేకరణ ఇబ్బందిగా మారడంతో నిర్లక్ష్యం చూపుతున్నారన్న విమర్శలు లేకపోలేదు.

నిర్వహణలో నిర్లక్ష్యం వద్దని హెచ్చరించినా..

గ్రామాల్లో ఏర్పాటు చేసిన క్రీడా ప్రాంగణాల నిర్వహణ బాధ్యత పంచాయతీలకు అప్పగించగా.. పట్టణాల్లో వాటిని పురపాలక సంఘాలు అప్పగించారు. క్రీడా ప్రాంగణాల నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు ఉంటాయని అధికార యంత్రాంగం హెచ్చరించినప్పటికీ పట్టించుకున్న దాఖలాలు లేవని క్రీడాకారులు ఆందోళన చెందుతున్నారు.

ఉప్పల్‌లో నీటి తిప్పలు అధికారులూ స్పందించరూ..



ఉప్పల్: ఉప్పల్ డివిజన్ పరిధిలో తాగునీటి సమస్య తీవ్రంగా ఉందని, మరికొన్ని చోట్ల లో ప్రెషర్ ఉందని, ఉప్పల్ విజయపురి కాలనీలో 15 రోజులుగా తాగునీరు సరఫరా కావడం లేదని డివిజన్ కార్పొరేటర్ మందముల రజిత పరమేశ్వర్‌రెడ్డి గురువారం స్థానికులతో కలిసి జలమండలి జనరల్ మేనేజర్ సంతోష్, డీజీఎం రజినీకాంత్‌రెడ్డిని కలిసి సమస్యను వివరించారు. లక్ష్మీనారాయణ కాలనీలో డ్రైనేజీ సమస్య తీవ్రంగా ఉందని, ఎండాకాలం రాకముందే శాంతినగర్, విజయపురి కాలనీవాసులు నీటికి ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. వెంటనే తాగునీటి సమస్యకు పరిష్కారం చూపాలని అధికారులను కోరారు. కార్యక్రమంలో ఎ– బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మందముల పరమేశ్వర్‌రెడ్డి, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

నగరంలోని స్కూల్స్‌తో యులిప్స

సాక్షి, సిటీబ్యూరో: దేశంలోనే తొలి ఓటీటీ తరహా లెర్నింగ్ ప్లాట్‌ఫార్మ్‌గా ప్రారంభమైన యులిప్స.. నగరంతో పాటు రాష్ట్ర వ్యాప్తంగానూ పాఠశాలలతో భాగస్వామ్యం ఏర్పర్చుకుంది. ఈ విషయాన్ని సంస్థ ప్రతినిధులు తెలిపారు. జాతీయ విద్యా విధానానికి అనుగుణంగా చదువుతో పాటు విద్యార్థుల సమగ్ర నైపుణ్యాభివృద్ధి కోసం దేశవ్యాప్తంగా ఇప్పటికే 200 పాఠశాలలతో కలిసి పనిచేస్తున్నామని, ఒకటి నుంచి 10వ తరగతి వరకూ విద్యార్థులకు ఉపకరించే స్కిల్స్ అందించేందుకు వీలుగా శిక్షణ కార్యక్రమాలు డిజైన్ చేశామన్నారు.

హామీలకే పరిమితమైన బీఆర్ఎస్ ప్రభుత్వం

బోడుప్పల్: బీఆర్ఎస్ ప్రభుత్వం హామీలకే పరిమితమైందని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తోటకూర వజ్రేష్‌యాదవ్ అన్నారు. బోడుప్పల్ 16వ డివిజన్‌లో గురువారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన హాత్ సే హాత్ జోడో యాత్రకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టెలిఫోన్ కాలనీ, ఎస్‌బీఆర్ కాలనీ, పీఎస్ఆర్‌కాలనీ, వెంకట్‌రెడ్డి కాలనీ, బీఎల్‌నగర్, మణికంఠ సాయినగర్, భవానీనగర్ కాలనీల్లో ఇంటింటికీ తిరిగి స్థానిక సమస్యలు అడిగి తెలుసుకున్నట్లు వెల్లడించారు. ప్రస్తుతం గుర్తించిన ప్రజాసమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం కోసం పార్టీ తరఫున కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు పోగుల నర్సింహారెడ్డి, బొమ్మక్ కళ్యాణ్‌కుమార్, కొత్త దుర్గమ్మ, ప్రధాన కార్యదర్శి కొత్త ప్రభాకర్‌గౌడ్, బీ బ్లాక్ ప్రధాన కార్యదర్శి కొత్త కిశోర్‌గౌడ్, యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి పొన్నం తరుణ్ గౌడ్, నాయకులు పోగుల దిలీప్‌రెడ్డి, వెంకటేశ్‌గుప్త పాల్గొన్నారు.



బోడుప్పల్ 16వ డివిజన్‌లో కాంగ్రెస్ నేతల ప్రచారం

చిలుకానగర్‌లో సమస్యల తిష్ట

ఉప్పల్: చిలుకానగర్ డివిజన్‌లో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన హాత్ సే హాత్ జోడో కార్యక్రమానికి కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు రాగిడి లక్ష్మారెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. నాయకులు, స్థానికులతో కలిసి గడపగడపకూ తిరిగి స్థానిక సమస్యలను తెలుసుకున్నారు. మజ్జి గౌరమ్మ టెంపుల్, శ్రీనివాస హైట్స్, కుమ్మరి కుంట, హెచ్‌బీ పెట్రోల్ బంక్‌బస్తీ, న్యూరాంనగర్ తదితర ప్రాంతాల్లో పాదయాత్ర చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో ఎక్కడ చూసినా సమస్యలు తాండవిస్తున్నాయన్నారు. జిల్లా ఎస్సీ సెల్ చైర్మన్ పత్తి కుమార్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు సుధాకర్‌శెట్టి, రాజ్యలక్ష్మీ, కృష్ణారెడ్డి, నెమలి అనిల్, సంజయ్ జైన్, అబ్దుల్ రషీద్, మోహన్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

భూగర్భ డ్రైనేజీ పనులకు నిధులివ్వండి



దానకిషోర్‌కు వినతి పత్రం అందజేస్తున్న కార్పొరేటర్ శాంతి సాయిజెన్

మల్లాపూర్: నాచారం ఓల్డ్ విలేజ్‌లో భూగర్భ డ్రైనేజీ నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కోరుతూ జలండలి మేనేజింగ్ డైరెక్టర్ దానకిషోర్‌ను స్థానిక ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డితో కలిసి నాచారం కార్పొరేటర్ శాంతి సాయిజెన్ శేఖర్ వినతి పత్రం అందజేశారు. మ్యాన్‌హోల్స్ నుంచి తొలగించిన మట్టిని నెలలు గడిచినా తొలగించడం లేదన్నారు. అదనంగా సిల్ట్ వెహికల్స్‌ను ఏర్పాటు చేస్తామని దానకిషోర్ హామీ ఇచ్చినట్లు కార్పొరేటర్ తెలిపారు.

జన్మదిన శుభాకాంక్షలు



మల్లాపూర్: బీఆర్ఎస్ ఉద్యమకారుడు, సీనియర్ నేత కుంటి కృష్ణ జన్మదిన వేడుకలను మల్లాపూర్ వార్డు కార్యాలయంలో గురువారం ఘనంగా నిర్వహించారు. కుంటి కృష్ణకు ఉప్పల్ ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి, మల్లాపూర్ కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్ గొల్లూరి అంజయ్య శుభాకాంక్షలు తెలిపారు.

ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

రామంతాపూర్: రామంతాపూర్ కామాక్షిపురంలో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆయుష్మాన్ భారత్, జన ఆరోగ్య యోజన సుకన్య సమృద్ధి యోజన పథకాల అవగాహన శిబిరాన్ని గురువారం బండారు శ్రీవాణివెంకట్రావు ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ ప్రధాని నరేంద్రమోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం దేశంలోని పేద, మధ్య తరగతి ప్రజల కోసం ప్రవేశపెట్టిన ఆరోగ్య బీమా, జీవిత బీమా, సుకన్య సమృద్ధి యోజన వంటి పథకాలతో లబ్ధి పొందాలని సూచించారు. సంక్షేమ సంఘం నేతలు దుర్గేష్, నారాయణదాసు, శ్రీనివాస్, మధుగౌడ్, రవి, అంజయ్య పటేల్ పాల్గొన్నారు.

స్వచ్ఛ హైదరాబాద్.. అందరి లక్ష్యం

కూకట్‌పల్లి జోనల్ కమిషనర్ మమత

అల్వాల్: వీధుల్లో చెత్త లేకుండా చేసినప్పుడే స్వచ్ఛ హైదరాబాద్ కల సాకారమవుతుందని జీహెచ్ఎంసీ కూకట్‌పల్లి జోనల్ కమిషనర్ మమత అన్నారు. స్వచ్ఛ ఆటో ఏఎస్‌ఏలతో కలిసి ప్రతి ఇంటి నుంచి చెత్తను సేకరించాలని, ప్రజలతో మమేకమైనప్పుడే క్లీన్ సిటీకి వారి సహకారం అందుతుందని సూచించారు. 'క్లీన్ హైదరాబాద్'పై అల్వాల్ సర్కిల్‌లో గురువారం అవగాహన వర్క్‌షాప్ జరిగింది. జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో మమత ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రామ్ కీ వారి సహకారం తీసుకోవాలని చెప్పారు. స్వచ్ఛ ఆటోలు ఇంటింటికీ తిరిగి రోజూ చెత్త సేకరించినప్పుడే లక్ష్యం నెరవేరుతుందన్నారు. ఈ వర్క్‌షాప్‌లో జీహెచ్ఎంసీ జాయింట్ కమిషనర్లు ఉమా ప్రకాష్, సంధ్యారాణి, నార్త్ జోనల్ డిప్యూటీ కమిషనర్లు నాగమణి, మంగతాయారు, రవీందర్, రవికుమార్, ఏఎంహెచ్‌ఓలు మంజుల, మమత, వెంకటరమణ, ఎస్.ఎస్.ప్రభాకర్, భానుచందర్, రాంకీ తరపున రామకృష్ణారెడ్డి, నరసింహారావు, సంతోష్, శ్రీనివాస్, నాగేశ్వరరెడ్డి, హరికృష్ణరెడ్డి, మణికంఠరెడ్డి పాల్గొన్నారు. ఈ సదస్సును ఎస్జీఓ తరపున మేజర్ శివకిరణ్ నిర్వహించారు.



మాట్లాడుతున్న జోనల్ కమిషనర్ మమత

క్రీడలూ రెండూ ముఖ్యమే..

మేడిపల్లి: చదువుతోపాటు క్రీడల్లో రాణించేందుకు విద్యార్థులు కృషి చేయాలని అరోరా కాలేజీ డైరెక్టర్ శ్రీకాంత్ అన్నారు. పర్వతాపూర్‌లోని అరోరా టెక్నాలజికల్ స్టూడెంట్ యాక్టివిటీ కమిటీ, క్రీడా క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జాతీయ స్థాయి క్రికెట్ పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 20 ఇంజినీరింగ్ కళాశాలల నుంచి విద్యార్థులు ఈ క్రీడల్లో పాల్గొంటున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో అవుషాపూర్ అరోరా కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ మహేష్ ప్రభు, స్పోర్ట్స్ మీట్ కన్వీనర్ డాక్టర్ అజయ్‌కుమార్, ఫిజికల్ డైరెక్టర్ వేణుగోపాల్, అసిస్టెంట్ రిజిస్ట్రార్ బాలకృష్ణారెడ్డి, కో ఆర్డినేటర్ శ్రావణ్ కుమార్‌రెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న శ్రీకాంత్

నాలా విస్తరణపై నిపుణుల కమిటీ వేయాలి



డీసీతో సమావేశమైన కార్పొరేటర్, కాలనీవాసులు

మల్కాజిగిరి: విష్ణుపురికాలనీలో నాలా విస్తరణపై నిపుణుల కమిటీ వేసి నిర్ణయించాలని మల్కాజిగిరి కార్పొరేటర్ శ్రవణ్ సర్కిల్ డీసీకి విజ్ఞప్తి చేశారు. సర్కిల్ కార్యాలయంలో కాలనీవాసులతో కలిసి గురువారం సమావేశమయ్యారు. సినీపోలీస్ నుంచి విష్ణుపురి కాలనీ మీదుగా జరుగుతున్న నాలా విస్తరణతో భవిష్యత్‌లో ఇబ్బందులు తలెత్తుతాయని ఆయన దృష్టికి తీసుకొచ్చామని తెలిపారు. విష్ణుపురి కాలనీ క్రింది ప్రాంతాల మీదుగా వెళ్లే నాలా నిర్మాణం గ్రావిటీ లేకపోతే పైన ఉన్న కాలనీల్లో నీరు నిలిచే అవకాశం ఉందన్నారు. ఇంజినీరింగ్ విభాగం నిపుణుల కమిటీ పరిశీలించిన తర్వాత నాలా విస్తరణ పనులు చేపట్టాలని కోరామన్నారు. సమావేశంలో డీఈ మహేష్, ఏఈ దీపక్, కాలనీవాసులు మురళీమోహన్, అఖిల్, హనుమాన్, మూర్తి, రామ్మోహన్ రావు తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమణలపై అధికారుల ఆగ్రహం

ఉప్పల్: ఉప్పల్ బగాయత్ హెచ్ఎండీఏ లేఅవుట్‌లో అక్రమ నిర్మాణాలను అధికారులు గురువారం కూల్చివేశారు. బగాయత్ లే అవుట్‌లో ప్రభుత్వ స్థలాలను ఆక్రమించి అద్దెలకు ఇచ్చుకుంటున్నారనే ఫిర్యాదులతో రంగంలోకి దిగిన హెచ్ఎండీఏ, ఉప్పల్ పట్టణ ప్రణాళిక విభాగం అధికారులు సంయుక్తంగా నిర్మాణాలను కూల్చివేశారు. ఆక్రమణదారులను అలాగే వదిలేశారని, చిన్న టీ కొట్టులాంటి వాటిని కూల్చివేసి పేదోళ్ల పొట్టకొట్టారని పలువురు విమర్శించారు.



ఉప్పల్ బగాయత్ లే అవుట్‌లో నిర్మాణాలను కూల్చివేస్తున్న అధికారులు

ఉద్యమకారుడికి పరామర్శ



కాప్రా: తెలంగాణ రాష్ట్ర ఉద్యమకారుడు రమేష్‌చారి అనారోగ్యంతో బాధపడుతున్నారు. విషయం తెలుసుకున్న తెలంగాణ తొలి ఎంబీసీ చైర్మన్ తాడూరి శ్రీనివాస్ కాప్రా సర్కిల్ జమ్మిగడ్డలోని ఆయన నివాసానికి గురువారం వెళ్లి పరామర్శించారు. రమేషచారి ఆరోగ్య వివరాలను అడిగి తెలుసుకుని ధైర్యంగా ఉండాలని చెప్పి ఆర్థిక సాయం అందించారు. ఈ సందర్భంగా తాడూరి శ్రీనివాస్‌ను పలువురు స్థానిక ఉద్యమకారులు, స్థానిక నేతలు కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఉద్యమ సమయంలో ఎంతో మంది పార్టీకి అండగా ఉంటూ అభ్యర్థుల విజయాలకు అహర్నిషలు కృషి చేశారన్నారు. అలాంటి వారిలో రమేష్‌చారి వంటి నిరుపేదలు ఎంతోమంది ఉన్నారని, వారిని ఆదుకునేందుకు ప్రజాప్రతినిధులతో పాటు స్థోమత కలిగిన ప్రతి కార్యకర్త ముందుకు రావాలని కోరారు. తాడూరి శ్రీనివాస్ మాట్లాడుతూ.. అన్నివిధాలుగా వెనుకబడిన బీసీలంతా ఐక్యంగా ఏకతాటిపైకి వచ్చి రాజకీయ రిజర్వేషన్లు పొందేవరకు పోరాటం చేయాలన్నారు. విశ్వకర్మ, విశ్వబ్రాహ్మణ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వేములవాడ మదన్‌మోహన్, విశ్వకర్మ ట్రస్ట్ కాప్రా సభ్యులు, చీఫ్ అడ్వైజర్ జ్యోతిర్మయిచారి, స్థానిక నాయకులు మరాఠ రవీంద్రరావు, శివప్రసాద్, కుమారస్వామి, వస్త్రాల వెంకటేష్, నాగరాజు, కల్యాణ్ పాల్గొన్నారు.